# రియో +20 .. ప్రధానోద్దేశం గ్రీన్ ఎకానమీ ఏర్పాటు

గ్రూప్-1 మెయిన్స్ పేపర్-1 (జనరల్ ఎస్సే) కు సంబంధించి విద్యార్థులు సన్నద్ధం కావాల్సిన ముఖ్యమైన అంశం పర్యావరణం. ప్రపంచవ్యాప్తంగా 'గ్లోబల్ వార్మింగ్' తీవ్రమైన చర్చనీయాంశం కావడంతో పోటీ పరీక్షల కోణంలోనూ ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. కాబట్టి అభ్యర్థులు ఈ దిశగా సన్నద్ధం కావాలి. జూన్ చివరి వారంలో జరిగిన రియో+20 సదస్సు, హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న అంతర్జాతీయ జీవవైవిధ్యత సదస్సు (బయోకాన్) నేపథ్యంలో ఈసారి మెయిన్స్‌లోనూ పర్యావరణ సంబంధ ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రియో+20 ముఖ్యాంశాలపై విశ్లేషణ..

రియో+20 సదస్సు గురించి విశ్లేషిస్తే.. 1992లో ప్రారంభమైన ధరిత్రీ సదస్సుకు 20 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో సదస్సుకు ప్రారంభ (1992లో) వేదికైన రియోడిజెనీరియోలోనే జూన్ 20-22 తేదీల్లో రియో+20 సదస్సు జరిగింది. సుమారు 40 వేల మంది అధికార, అనధికార ప్రతినిధులు ఈ అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యారు. హరిత ఆర్థిక వ్యవస్థ (Green Economy)ను ఏర్పర్చడం ద్వారా సుస్థిరాభివృద్ధి; పేదరిక నిర్మూలన సాధన ప్రధానోద్దేశంగా ఈ సదస్సును నిర్వహించారు. 1992లో ధరిత్రీ సదస్సులో ఆమోదించిన ఎజెండాలు, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఆర్థికాభివృద్ధిని సాధించడానికి; సామాజిక సమానత్వాన్ని సాధించడానికి ఒక వ్యూహ చట్రాన్ని ప్రతిపాదించింది. కానీ 1992లో ప్రారంభ సదస్సులో పేర్కొన్న ఎజెండా-21 అమలు తీరు నిరాశాజనకంగా ఉందనడంలో సందేహం లేదు. భూతాపం పెరుగదల రేటు తగ్గిన సూచనలు కనబడట్లేదు. ప్రపంచవ్యాప్తంగా జలరాశులు అంత రిస్తున్నాయి. వాయు కాలుష్యం, జల కాలుష్యం మరింత తీవ్రమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. శీతోష్ణస్థితి మార్పుల దుష్ప్రభావం మానవ సమాజాలపై ప్రభావం చూపుతోంది. నైరుతి రుతుపవనాలతోపాటు ప్రపంచ పవన వ్యవస్థల రీతుల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అకాల వర్షాలు, వర్షాభావం, అకస్మాత్తుగా సంభవిస్తున్న వరదలు, బీభత్సమైన తుఫానులు, ఎడారుల విస్తరణ తదితర ప్రకృతి వైపరీత్యాల తరచుదనం పెరిగింది.

ప్రతి సంవత్సరం సుమారు 50 బిలియన్ పౌండ్ల విలువైన జీవవైవిధ్యత నశిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి సగటున ఒక మిలియన్ ప్రజలు ఆకలిబారిన పడుతున్నారు. ఆర్థిక వ్యవస్థల పతనం, మార్కెట్ల వైఫల్యంతో ఇటీవల సుమారు వంద మిలియన్ల ప్రజలు అదనంగా పేదరికం జాబితాలోకి వెళ్లడం గమనార్హం. ప్రపంచ జనాభాలో సుమారు 20 శాతం (1.4 బిలియన్లు) కేవలం 1.25 డాలర్లు లేదా అంతకంటే తక్కువ దినసరి ఆదాయంతోనే జీవిస్తున్నారు. 1.5 బిలియన్ల మంది ప్రజలకు ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదు. 2.5 బిలియన్ల మందికి పరిశుభ్ర మరుగుదొడ్ల సౌకర్యం లేదు.

శీతోష్ణస్థితి మార్పులు, పర్యావరణ క్షీణత ఇదే తీరులో కొనసాగితే భూగోళంపై కనీసం 33 శాతం జీవులు అంతరించే ప్రమాదం పొంచి ఉంది. శీతోష్ణస్థితి మార్పుల దుష్ప్రభావం తృతీయ ప్రపంచ దేశాలు, ముఖ్యంగా సబ్‌సహారన్ ఆఫ్రికా, దక్షిణాసియా దేశాలపై ఉంటుందని నిపుణుల అభిప్రాయం. ఈ రెండు ప్రాంతాల్లో శీతోష్ణస్థితి మార్పులు, పర్యావరణ కాలుష్యం కారణంగా దేశాల మానవాభివృద్ధి సూచిక (హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్- ఏఈఐ) విలువ 12 శాతం దిగజారుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

UNEP హరిత ఆర్థిక వ్యవస్థ నివేదిక (Green Economy Report) ప్రకారం.. 10 ప్రాధాన్యతా రంగాల్లో 12 శాతం జీడీపీ పెట్టుబడులను కేటాయిస్తే ప్రపంచ సమాజాలు అల్పకర్బన (Low Corban) వనరుల ఉచిత వినియోగ (Resource Efficient Use) ఆర్థిక వ్యవస్థలుగా రూపాంతరం చెందాయి.

### మార్కెట్ శక్తుల గుత్తాధిపత్యం:

సుస్థిరాభివృద్ధి, హరిత ఆర్థిక వ్యవస్థల నిర్మాణంలో భాగంగా అంతర్జాతీయ సమాజం మొదట్నుంచీ అధిక వ్యయంతో కూడిన పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి కేంద్రీకరిస్తోంది తప్ప సహజ వనరుల వినియోగంపై నియంత్రణ, సామాజిక న్యాయం, పేదరికం వంటి అంశాలపై దృష్టి సారించట్లేదు. పర్యావరణాన్ని కేవలం ద్రవ్యంగా పరిగణిస్తూ పర్యావరణ వనరులను గతంలో కంటే అధిక స్థాయిలో వినియోగిస్తున్నారు. వనరుల వినియోగంపై మార్కెట్ శక్తుల గుత్తాధిపత్యం ప్రబలింది. వనరుల సక్రమ వినియోగంలో భాగంగా అతి కీలకమైన; మనిషి దైనందిన జీవితానికి ఆధారమైన జలవనరులపైనా ప్రైవేటు సంస్థల గుత్తాధిపత్యం ప్రారంభమైంది. నీటిని ముడి వస్తువుగా పరిగణిస్తూ ప్రపంచ నీటి మార్కెట్లను ఏర్పాటు చేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ ప్రయత్నాలన్నిటికీ సుస్థిరాభివృద్ధి, జల వనరుల సంరక్షణ, సక్రమ వినియోగం వంటి పదజాలంతో కూడిన పర్యావరణ ముసుగును తొడుగుతున్నారు. భారత్, బోట్స్‌వానా వంటి తృతీయ ప్రపంచ దేశాల్లోని నిరుపేదలను జీవవైవిధ్యత బాండ్లు, గ్రీన్ బ్యాంక్‌లు, నీటి స్పాట్ మార్కెట్లు, నీటి ఫ్యూచర్ మార్కెట్లు వంటి ప్రపంచీకరణ మార్కెట్ చక్రవ్యూహంలో బంధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

1992లో శ్రీకారం చుట్టిన ధరిత్రీ సదస్సు అనంతరం, గత రెండు దశాబ్దాల్లో పర్యావరణ విపణిలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలు ఆయా దేశాల పెట్టుబడిదారులు, కంపెనీల ఎజెండానే పర్యావరణ సదస్సులో ప్రవేశపెడుతున్నట్లు అవగతమవుతోంది. ప్రపంచ మానవాళి శ్రేయస్సు; పేదరికంపై పోరాటం; ప్రపంచవ్యాప్తంగా సుస్థిరాభివృద్ధిపట్ల వాటి శ్రద్ధపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పర్యావరణ సదస్సుల్లో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. కోపెన్ హెగన్ సదస్సులో ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది.

## రియో+20లోనూ అదే తీరు:

ఇటీవల నిర్వహించిన రియో+20 సదస్సులోనూ అమెరికా, కెనడా, యూరప్ దేశాలు సుస్థిరాభివృద్ధికి మాత్రమే పెద్దపీట వేస్తూ చర్చలను ప్రారంభించాయి. అయితే మన దేశ ప్రధాని మన్మోహన్ సింగ్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.పేదరిక నిర్మూలన జరగనిదే సుస్థిరాభివృద్ధి సాధ్యం కాదని సుస్పష్టం చేసి చర్చను సరైన దిశలోకి మార్చారు. భారత్-చైనా నాయకత్వంలో తృతీయ ప్రపంచ దేశాలు మానవ హక్కుల్లో భాగంగా నీటి హక్కు (Right to Water), పర్యావరణ హక్కు (Right to Clean Environment) ఉండాలని బలంగా వాదించారు.

ఈ సదస్సులో.. భారత్, చైనా, బ్రెజిల్ నాయకత్వంలోని తృతీయ ప్రపంచ దేశాలు సుస్థిరాభివృద్ధి దృగ్విషయం పట్ల తమ ప్రజల సందేహాలను, మనోగతాలను అంతర్జాతీయ సమాజ దృష్టికి తేవడంలో కృతకృత్యులయ్యారనే చెప్పొచ్చు. హరిత ఆర్థిక వ్యవస్థల రూపకల్పనకు చేపట్టాల్సిన కార్యప్రణాళిక సుస్థిర ఉత్పత్తి (Sustainable Production), సుస్థిర వినిమయం (Sustainable Consumption), కార్పొరేట్ సుస్థిరత (Corporate Sustainability) వంటి అంశాలను చేర్చడం ద్వారా విశృంఖల వినిమయ సంస్కృతి, కార్పొరేట్ బాధ్యతా రాహిత్యం, అనంత వృద్ధి ప్రక్రియ వంటి వాటిని నియంత్రించడానికి తొలి అడుగు పడిందనే చెప్పొచ్చు. ఈ సమావేశంలో ఆమోదించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు భవిష్యత్ ఒప్పందాలకు ఒక ప్రాథమిక చట్రాన్ని నిర్దేశించాయనేది కూడా నిస్సందేహం.

రియో+20లో అర్థవంతమైన, నిర్మాణాత్మకమైన చర్చలు నిర్వహించడానికి, ఘర్షణ వాతావరణాన్ని నివారించడానికి బ్రెజిల్ నిర్వాహకులు నూతన విధానాన్ని అవలంబించారు. జాతీయ ప్రభుత్వాల ప్రతినిధులను, పౌర సమాజ ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి అంశాలవారీగా పారదర్శకంగా, నిర్మాణాత్మక చర్చలను నిర్వహించారు. పేదరికం, వ్యవసాయం, ఆహార భద్రత, శక్తి, నీరు,సుస్థిర నగరాలు వంటి 10 అంశాలపై విస్తృత సంప్రదింపులు సాగించడమే కాక.. ఈ అంశాలపై ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించారు. ఈ రకంగా రియో+20 సదస్సు ఐక్యరాజ్య సమితికి, బహుళ పక్షత (Multi Lateralism)కు విజయంగా పేర్కొనొచ్చు.

## జాగ్రత్తగా.. జనరల్ ఎస్సే

సాధారణంగా అభ్యర్థులు గ్లోబల్ వార్మింగ్ అంటే ఏంటి? కారణాలు ఏంటి? దుష్ఫలితాలు ఏంటి? జాతీయంగా, అంతర్జాతీయంగా అనుసరిస్తున్న వ్యూహాలు? వంటి అంశాలపైనే సన్నద్ధత పొందే ప్రయత్నం చేస్తారు. కానీ గత మెయిన్స్‌లో 'కోపెన్‌హెగన్ సదస్సు నేపథ్యంలో శీతోష్ణస్థితి మార్పులను ఎదుర్కొనే వ్యూహం విషయంలో అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలకు, అభివృద్ధి చెందుతున్న తృతీయ దేశాలకు మధ్య విస్తరిస్తున్న అగాధాన్ని (వైరుధ్యాలు, వివాదాలు) గురించి సూటిగా ప్రశ్నించారు. అంటే.. అభ్యర్థిలోని విశ్లేషణ శక్తిని పరీక్షిస్తున్నారు. కాబట్టి ఫ్యాక్ట్స్, ఫిగర్స్, నిర్ణయాలకే పరిమితం కాకుండా విభిన్న కోణాల్లో (ఫలితాలు, పర్యవసానాలు తదితర) అంశాన్ని విశ్లేషించుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

## హరిత ఆర్థిక వ్యవస్థపై భిన్నాభిప్రాయాలు

హరిత ఆర్థిక వ్యవస్థ ఇతివృత్తం ఆహ్వానించదగినదైనా అవగాహన విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. UNEP నిర్వచనం ప్రకారం 'పర్యావరణ ఇబ్బందులు, సమస్యలు, ఆవరణ వ్యవస్థల కొరతలను చెప్పుకోదగిన స్థాయిలో తగ్గించుకుంటూ సామాజిక సమానత్వం, మానవాభివృద్ధిని సాధించే ఆర్థిక వ్యవస్థే' హరిత ఆర్థిక వ్యవస్థ. కానీ ఈ నిర్వచనం గందరగోళంతో కూడుకుంది. ఈ పరిస్థితిని వినియోగించుకుని గత రెండు దశాబ్దాల కాలంలో హరిత ఆర్థిక వ్యవస్థ పేరుతో పర్యావరణ సదస్సులు, చర్చల్లో ఆవరణ వ్యవస్థల్లోని సహజ వనరులను కేవలం ఆర్థిక కోణంలో చూడటమే మొదలుపెట్టారు. పర్యావరణ పరిరక్షణ ముసుగులో సహజ వనరుల ప్రైవేటీకరణకు తెరతీశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినియోగించిన పబ్లిక్-ప్రైవేట్ పెట్టుబడులు ఆ ఉద్దేశానికి ఎంత మేర ఉపయోగపడినాయనేది ప్రశ్నార్థకమైంది. ఉదాహరణకు క్యోటో ప్రోటోకాల్‌లో భాగంగా, తర్వాత రూపొందించిన కర్బన వాణిజ్యం, REDD(Reduction of Emmissions from Deforestation and Degeneration) పర్యావరణ హానికారకాలుగా మారాయి. కర్బన వాణిజ్యం ద్వారా యూరప్ సమాజం అధిక కర్బనాన్ని విడుదల చేసే పరిశ్రమలకు రాయితీ ఇచ్చింది. REDD పథకం దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాల్లోని వర్షపాత అరణ్యాలను చట్టబద్ధంగా నరికే మార్గాన్ని ఏర్పరచింది.

### ఎక్స్‌పెక్టెడ్ జనరల్ ఎస్సే కొశ్చన్స్

- ధరిత్రీ సదస్సు జరిగి రెండు దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా పర్యావరణ కాలుష్యం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సుమారు ఒక బిలియన్ మంది ప్రజలు ప్రతిరోజు ఆకలితో నిద్రిస్తున్నారు. రియో+20 సదస్సులో చర్చను పరిశీలించి, సదస్సు ఫలితాలను మూల్యాంకన చేయండి.

- గ్రీన్ ఎకానమీ అంటే ఏంటి? సుస్థిరాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు గ్రీన్ ఎకానమీ స్థాపన ఏ విధంగా జరగాలని రియో+20 సదస్సులో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయో వివరించండి.

- తృతీయ ప్రపంచ దేశాలు 'మేము కోరుకుంటున్న భవిష్యత్ (Future We Want)కు, అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల 'మేము కోరుకుంటున్న భవిష్యత్'కు మధ్య అంతరాలను పరిశీలించి రియో+20 సదస్సు ఈ అంతరాలను దూరం చేయడంలో ఎంతమేర సఫలీకృతమైందో పరిశీలించండి?

- వరల్డ్ హెరిటేజ్ కమిటీ పశ్చిమ కనుమలను వరల్డ్ హెరిటేజ్ సైట్స్ జాబితాలో చేర్చాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా పశ్చిమ కనుమల జీవ వైవిధ్యతను పరిశీలించి, సుస్థిరాభివృద్ధికి జీవ వైవిధ్యత పరిరక్షణ ఏ విధంగా దోహదపడుతుందో చర్చించండి?